FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM
AMMA NEWS
డిజిటల్
శనివారం
31 ఆగస్టు 2024


3లో

# టీ పీసీసీ ఫైనల్

## మహేష్ కుమార్ గౌడ్‌కు పట్టం

**పశ్చిమ బెంగాల్ చీఫ్‌గా దీపాదాస్ మున్షీ**


3లో

# నాలుగో నగరి.. రేవంత్ గురి

**మరో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు సన్నద్ధం**


## క్విక్ బైట్స్


4లో

### రేవంత్ సిగ్గుపడాలి

ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**


4లో

### అల్ప పీడన ప్రభావం

తెలంగాణకు అలర్ట్ జారీ

**అప్రమత్తమన్న వాతావరణ శాఖ**


4లో

### మహిళలపై నేరాలు తీవ్ర ఆందోళనకరం

**ప్రధాని నరేంద్ర మోదీ**




# దుమారం

## బల్దియా అక్రమాలపై కాంగ్రెస్ భగ్గు

- అట్టుడికిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- ప్ల కార్డులతో నిలదీసిన కాంగ్రెస్ సభ్యులు
- తాంసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణంపై దుమారం
- భాధ్యులపై చర్యలకు డిమాండ్

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసాగా జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులు నిల్చొని బల్దియా పరిధిలో ఆక్రమణలు, అక్రమ కట్టడాల అంశాలపై లేవనెత్తారు. విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమార్కులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ఆదిలాబాద్, అమ్మన్యూస్ ప్రతినిధి



సులభ్ కాంప్లెక్స్ కూల్చి నిర్మాణం: బండారు సతీష్, కౌన్సిలర్




# దుమారం

## బల్దియా అక్రమాలపై కాంగ్రెస్ భగ్గు

- అట్టుడికిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- ప్ల కార్డులతో నిలదీసిన కాంగ్రెస్ సభ్యులు
- తాంసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణంపై దుమారం
- భాద్యులపై చర్యలకు డిమాండ్

**ఆదిలాబాద్ అమ్మన్యూస్ ప్రతినిధి:** ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసాగా జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులు నిల్చొని బల్దియా పరిధిలో ఆక్రమణలు, అక్రమ కట్టడాల అంశాలపై లేవనెత్తారు. విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమార్కులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. మున్సిపల్ చైర్మెన్ చర్చిద్దామని చెప్పగా సభ్యులు ఆగకుండా ఆందోళన కొనసాగించారు. అధికారులు దీనిపై సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. బీజేపీ సభ్యులు అటు ముందుగా ఎజెండా అంశాలపైనే చర్చ జరపాలంటూ చైర్మెన్ పోడియం వద్దకు వెళ్లి నినదించారు. సభ్యుల నిరసన నినాదాల మధ్య సభ ఒక్కసారిగా హీటెక్కింది. చైర్మెన్ సభ్యులకు సర్దిచెప్పి ఎజెండాను ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు అనేక సమస్యలపై, అంశాలపై నిలదీశారు. అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ముఖ్యంగా బల్దియా పరిధిలో అనేక స్థలాలు ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించడంలో విఫలం అవుతున్నారని ధ్వజమెత్తారు. తాంసి బస్టాండ్ సమీపంలో మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాన్ని దర్జాగా ఆక్రమించి ప్రస్తుతం అక్కడ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. 20 ఏళ్ల కిందట లేఅవుట్ చేసిన సందర్భంలో కొంత ఖాళీ స్థలాన్ని వదిలేశారన్నారు. ఆ స్థలంలోనే ప్రజల అవసరాల దృష్ట్యా సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిపారన్నారు. కోట్లు విలువ చేసే ఆ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్నుపడిందని పేర్కొన్నారు. ఆరు నెలల కిందట సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి బిల్డింగ్ నిర్మాణం


లే అవుట్ ప్రకారం వదిలేసిన స్థలంలో కొన సాగుతున్న భవన నిర్మాణం

జరుపుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో అప్పటి మున్సిపల్ అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పగా వారు భవన నిర్మాణానికి అక్రమంగా అనుమతిలిచ్చారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అటు లీజు స్థలాలు సైతం అనేకం అన్యాక్రాంతం అవుతున్నాయని, బల్దియా అధికారులకు ఇది ఎందుకు పట్టడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని కబ్జా కాకుండా ఇప్పటికైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఒక కమిటీని వేయాలని కోరారు.

### అనేక మస్యలపై సభలో చర్చ

ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మెన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు అనేక సమస్యలపై చర్చ పెట్టారు. ముందుగా 11 అంశాలపై ఎజెండా ప్రవేశపెట్టగా సభ్యులు ఒక్కోటి గా ప్రస్తావించారు. ముఖ్యంగా పలు వార్డులలో శానిటేషన్ సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోందని, ఏ వీధికెళ్లినా పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తూ కంపుకొడుతున్నాయన్నారు. అటు తాగునీరు సైతం సక్రమంగా సరఫరా కావడంలేదని ఆరోపించారు. మిషన్ భగీరథ పేరుమీద అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇప్పటికీ నీటి సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. వెంటనే దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అటు వినాయక నవరాత్రి ఉత్సవాలు సమీపించిన తరుణంలో టౌన్‌లో దెబ్బతిన్న రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదని, దాన్ని రద్దు చేసి వేరేవారికి అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, బల్దియా అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### సులభ్ కాంప్లెక్స్ కూల్చి నిర్మాణం



తాంసి బస్టాండ్ ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన స్థలంలో ఆరు నెలల కిందట సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి ప్రస్తుతం అక్కడ నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ స్థలాలు, బల్దియా లీజు స్థలాలు కబ్జా కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిరక్షించే విధంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. అలాగే పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరు మీద కోట్లాది రూపాయలు ఖర్చుచేసినా నేటికీ నీరు సరిగ్గా సరఫరా కావడంలేదు.

బండారు సతీష్, కౌన్సిలర్

### ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలి



ఆదిలాబాద్ పట్టణంలో ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు సైతం భారీగా ముడుపులు తీసుకుని అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేస్తాం. బల్దియా స్థలాలను పరిరక్షించే విధంగా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తగు చర్యలు చేపట్టాలి. అలాగే అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉంది. ఏ వీధికెళ్లినా కంపుకొడుతున్నాయి. మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా తయారయ్యింది.

జహీర్ రంజాని, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్

# రేవంత్ బ్రాండ్.. హైడ్రా

## రాష్ట్రవ్యాప్తంగా ఫుల్ క్రేజ్

**ఇతర నగరాలు, పట్టణాల్లోనూ ఏర్పాటు చేయాలని డిమాండ్లు**

**రోజుకు 60 నుంచి 70 ఫిర్యాదులు**

**తెలుగు జాతి చరిత్రను తిరగరాస్తున్న సీఎం**

**డైనమిక్ సీఎం అంటూ జనం జేజేలు**



**(అమ్మన్యూస్, హైదరాబాద్):** మొన్నటి వరకూ తెలుగు జాతి చరిత్రను ఎన్టీఆర్‌కు ముందు.. తరువాత.. అని చెబుతారు. నేడు కొత్త ట్రెండ్ మొదలైంది. ఇప్పుడు రేవంత్ పాలనకు ముందు.. తరువాత అని చెబుతుండటం విశేషం. ఇందుకు ప్రధాన కారణం.. పారదర్శక పాలనతోపాటు హైడ్రా.. పేరు మార్మోగుతుండటం. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల రక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు అక్రమార్కులకు నిద్ర లేకుండా చేస్తుంటే.. స్వపక్షం, విపక్షం అనే తేడా లేకుండా బుల్డోజర్లు దూసుకెళ్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సీఎం రేవంత్‌కు జేజేలు పలుకుతున్నారు. మా పట్టణాల్లోనూ హైడ్రా తరహా ఏర్పాటు చేయాలంటూ డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. రోజుకు హైడ్రాకు కనీసం 60 నుంచి 70 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్న హైడ్రా, ఆక్రమణలను బట్టి చర్యలకు సిద్ధమవుతోంది.

### నాడు ఎన్టీఆర్..

మదరాసీలుగా ముద్రపడిని తెలుగువారికి 'తెలుగు వారు' అనే గుర్తింపు తెచ్చింది నందమూరి తారకరామారావు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి తెలుగు ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయిలో నిలిపారు ఆయన. తెలుగువాడి సత్తాను దేశమంతా చాటారు అన్న ఎన్టీఆర్. ఇక తెలుగు రాజకీయాల్లోనూ తెలుగుదేశంతో చాలా మార్పు వచ్చింది. ఇక హైదరాబాద్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఉమ్మడి ఏపీ రాజధాని అయినప్పటికీ.. ఉర్దూ ప్రాబల్యంగా, ఇతర జిల్లాల వారికి పెద్దగా అనుకూలంగా లేని హైదరాబాద్ ను అందరి నగరం చేశారు. ఎన్టీఆర్ తర్వాత ఉమ్మడి ఏపీ సీఎం అయినా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలిపారు. ఎన్ని విమర్శలు ఉన్నా.. భారీ భవంతులతో సైబరాబాద్ అనే అందమైన నగరం ఇప్పుడు మనకు కనిపిస్తోందంటే దానిని పునాది చంద్రబాబు వేసిందే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బయో టెక్నాలజీ (బీటీ)కి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఐటీ సంస్థలతో పాటు ఫార్మాకూ హైదరాబాద్ రాజధాని అయింది. క్షణం తీరికలేని రోజుల్లో.. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ను 25 ఏళ్ల కిందటే హైదరాబాద్ కు తీసుకొచ్చి.. ఈ నగరం పేరు ప్రపంచమంతా వినిపించేలా చేశారు.

### 95 శాతం బడా బాబులవే..

**హైదరాబాద్ నగరంలో చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించుకున్న కట్టడాల్లో దాదాపు 95 శాతం బడా బాబులవే. వాటిని కూల్చడాన్ని ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారు. పెద్దలను దెబ్బతీయడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల ముఖ్యమంత్రిగా రేవంత్ ఇమేజ్ సంపాదిస్తున్నారు. కుటుంబ సభ్యులు, సొంత పార్టీ నేతలు, మంత్రులు అన్న తేడాను ఆయన చూపడం లేదు. నిష్పాక్షికత కలిగిన డైనమిక్ సీఎంగా ఇమేజ్ పొందే లక్ష్యంతో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఇదంతా ముున్ముందు చరిత్ర తిరగేస్తే సీఎంలలో తనకంటూ పేజీ ఉండాలని రేవంత్ కోరుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది.**

### నాలుగో నగరితో సీఎం రేవంత్..

**నాలుగో నగరితో రేవంత్ గురి రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్).. నాలుగో నగరం (ముచ్చర్ల బేగరి కంచె).. మురికి నదిగా మారిన మూసీ ప్రక్షాళన.. అంటూ హైదరాబాద్ ఇమేజ్ ను పెంచే ప్రయత్నం చేస్తున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. అంతేకాక.. ఒకప్పుడు లేక్ సిటీగా పేరున్న హైదరాబాద్ ఇప్పుడు లేక్ లెస్ సిటీ అవుతున్న ప్రమాదాన్ని గుర్తించారు. దీంతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ను తీసుకొచ్చారు. రంగనాథ్ వంటి సిన్సియర్ ఐపీఎస్ సారథ్యంలో ఇప్పుడు హైడ్రా కలకలం రేపుతోంది. చెరువులను ఆక్రమించి విలాసవంతమైన భవనాలను కట్టుకున్న బడా బాబుల పనిపడుతోంది. ఇదంతా విజయవంతంగా సాగితే.. రేవంత్ కు ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్ తరహాలో బ్రాండ్ ఇమేజ్ తెచ్చే కార్యక్రమమే.**

### వైఎస్ ఆర్.. చెరగని ముద్ర

**ఉత్తమ పాలకుడికి ఉండే.. ఉత్తమ లక్షణం .. గత ప్రభుత్వాలు చేసిన మంచిని కొనసాగించడం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అక్షరాలా చేసింది ఇదే. హైదరాబాద్ కు ఏర్పడిన బ్రాండ్ ను మరింత ఎత్తులకు తీసుకెళ్లారు. భవిష్యత్ అవసరాలను గుర్తెరిగి.. శంషాబాద్ విమానాశ్రయాన్ని చకచకా పూర్తి చేయించారు. ఔటర్ రింగ్ రోడ్ అనే అతిపెద్ద ప్రాజెక్టును చేపట్టారు. ఇప్పుడది ఎంత అవసరమో తెలిసి వస్తోంది. మరోవైపు ఐటీ ఎగుమతులు అంతకంతకూ పెరిగేలా చూశారు. కొత్తకొత్త సంస్థలను ఆహ్వానించారు. ఉప్పల్ లో అంతర్జాతీయ క్రికెట్ మైదానం నిర్మాణమైంది వైఎస్ హయాంలోనే కావడం గమనార్హం.**

# నాలుగో నగరి.. రేవంత్ గురి

- మరో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు సన్నద్ధం
- దాదాపు 1000 ఎకరాల్లో నిర్మాణం
- పర్యాటక అభివృద్ధిపై సీఎం స్పెషల్ ఫోకస్

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** ఫోర్త్ సిటీ (ముచ్చర్ల బేగరి కంచె)పై తెలంగాణ ముఖ్యమంత్రి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే త్వరలోనే కొత్త జూ పార్క్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 1000 ఎకరాల్లో జూ పార్క్ నిర్మించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే నెహ్రూ జూ పార్క్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్న విషయం విదితమే. తెలంగాణలో పర్యాటక అభివృద్ధి కోసం కొత్త పాలసీని రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ పాలసీలను అధ్యయనం చేయాలని సూచించారు. ఎకో టూరిజం, హెల్త్ టూరిజం, టెంపుల్ టూరిజంలకు విడివిడిగా పాలసీలను రూపొందించాలన్నారు. స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ ప్రాజెక్టుల్లో భాగంగా సచివాలయంలో పర్యాటక రంగ అభివృద్ధిపై జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఈ మేరకు ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. తెలంగాణలో ఉన్న వనరుల అభివృద్ధికి అవసరమైన చోట పీపీపీ విధానాన్ని అవలంభించాలని సూచించారు.

### ఈ ప్రాంతాల్లో..



కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, కొన్ని చోట్ల రాత్రి విడిది ఉండే కాటేజీలను నిర్మించాలన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో జూ పార్క్ సందర్శకులను ఆకట్టుకుంటుండగా.. నగరం వెలుపల దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జామ్ నగర్‌లో ప్రముఖ వ్యాపారవేత్త అనంత్ అంబానీ 3 వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద, అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలన్నారు. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్స్టిట్యూట్ తరహాలో నేచర్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

### ఫోర్త్ సిటీలో..


హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా ప్రతిపాదించిన ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు.

# టీ పీసీసీ ఫైనల్

## మహేష్ కుమార్ గౌడ్‌కు పట్టం

| | |
|---|---|
| పశ్చిమ బెంగాల్ చీఫ్‌గా దీపాదాస్ మున్షీ | కొత్త ఇంఛార్జ్‌గా మాజీ సీఎం భూపేష్ భగేల్ |
| ఛత్తీస్ ఘడ్ సీఎంగా సేవలందించిన భగేల్ | రాష్ట్ర కాంగ్రెస్ పై పూర్తి అవగాహన ఉన్నందునే ప్రాధాన్యం |

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పీఠం ఎవరికి దక్కనుందన్న విషయంపై అధిష్టానం స్పష్టత ఇచ్చింది. టీ పీసీసీ చీఫ్ గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత కొన్నాళ్ళుగా రాష్ట్ర అధ్యక్ష పీఠం ఎవరికి కట్టబెట్టాలన్న అంశంపై తర్జన భర్జన పడిన అధిష్టానం పార్టీ నేతల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. అధ్యక్ష పీఠంపై స్పష్టతకు వచ్చిన అధిష్టానం పార్టీ వ్యవహారాలపై కీలక మార్పులకు సిద్ధమైంది. కొత్త పీసీసీ చీఫ్ తో పాటుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ ను నియమించనుంది. ఇప్పటికే ఈ హెూదాల్లో నియమించే వారి పేర్లను ఖరారు చేసింది. అధికారిక ప్రకటనే మిగిలి ఉంది. అదే సమయంలో మూడు రాష్ట్రాలకు కొత్త ఇంఛార్జ్ లను నియమించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అనేక చర్చల తరువాత టీపీసీసీ చీఫ్ గా బీసీ వర్గానికి చెందిన నేతకే పగ్గాలు అప్పగించాలని డిసైడ్ అయిన అధిష్టానం కీలక పదవుల కసరత్తును కూడా పూర్తి చేసింది. ఇప్పటికే పలు రాష్ట్రాలకు కొత్త కార్యదర్శులను నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. అదే విధంగా రాష్ట్ర పార్టీ ఇంఛార్జ్ లు.. పీసీసీ చీఫ్ ల నియామాకం పైన ఫైనల్ నిర్ణయానికి వచ్చింది. మూడు రాష్ట్రాలను పీసీసీ



చీఫ్‌లను ప్రకటించనున్న ఏఐసీసీ వారికి ఇప్పటికే సమాచారం ఇచ్చింది. ఈ సాయంత్రం లేదా రేపు ఉదయం మూడు రాష్ట్రాలకు కొత్త పీసీసీ అధ్యక్షుల ప్రకటన చేసేందుకు రంగం సిద్ధం అయింది. తెలంగాణ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ను, పశ్చిమ బెంగాల్ పీసీసీ చీఫ్‌గా దీపాదాస్ మున్షీని ఖరారు చేసారు. ఇక, కేరళ పీసీసీ అధ్యక్షుడుగా కేసీ వేణుగోపాల్ ను నియమించారు. కేసీ వేణుగోపాల్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా అశోక్ గెహ్లాట్ ను నియమిస్తూ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక, ప్రస్తుత తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ స్థానంలో ఛత్తీస్ ఘడ్ మాజీ సీఎం భూపేష్ భగేల్ ను నియమించాలని డిసైడ్ అయ్యారు.

# మహిళలపై నేరాలు తీవ్ర ఆందోళనకరం

## ప్రధాని నరేంద్ర మోదీ... రాజ్యాంగ పరిరక్షకుడిగా న్యాయవ్యవస్థ



**అమ్మన్యూస్, న్యూఢిల్లీ :** మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వర న్యాయం జరగాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అలా జరిగితేనే మహిళల భద్రతకు మరింత భరోసానిస్తుందన్నారు. న్యాయవ్యవస్థను రాజ్యాంగ పరిరక్షుడిగా పరిగణిస్తున్నామని, సుప్రీం కోర్టు, న్యాయవవస్థ తమ బాధ్యతను నిర్వర్తించిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, న్యాయవ్యవస్థపై దేశ ప్రజలు ఎప్పుడూ అపనమ్మకం చూపలేదని జిల్లా న్యాయవ్యవస్థలపై జరిగిన జాతీయ సదస్సులో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టుకు 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా స్మారక చిహ్నం స్టాంప్‌ను విడుదల చేశారు. మన ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని కాపాడే సంరక్షుడిగా వ్యవహరిస్తోందని, స్వాతంత్ర్యం తర్వాత న్యాయం అనే భావనను కాపాడింది. ఎమర్జెన్సీ వంటి చీకటి పరిస్థితులు వచ్చాయి. ఆ సమయంలో రాజ్యాంగ రక్షణలో కీలక పాత్ర పోషించింది. ప్రాథమిక హక్కులకు రక్షించింది. వాటితో పాటు జాతీయ ప్రయోజనాలకు సంబంధించి ప్రశ్న ఎదురైనప్పుడు సుప్రీం న్యాయస్థానం ఎప్పుడూ జాతీయ సమగ్రతను కాపాడుతూ వచ్చింది. ఈ అమృత్‌కాల్ సమయంలో 140 కోట్ల మంది దేశ ప్రజలు అభివృద్ధి చెందిన, సరికొత్త భారత్‌ను చూడాలని ఆశిస్తున్నారు. గత పదేళ్లలో కేసుల విచారణలో జాప్యాన్ని తొలగించేందుకు వీలుగా అనేక చర్యలు తీసుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల గురించి ప్రస్తావించిన ప్రధాని మోదీ దేశంలో మహిళలకు భద్రత కల్పించేందు అనేక కఠినమైన చట్టాలున్నాయి. 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టాన్ని తీసుకొచ్చాం. దీని కింద సాక్షులను రక్షించే కేంద్రాలను కూడా ఏర్పాటు చేశాం. ఈ విషయంలో జిల్లా పర్యవేక్షక బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వాటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే మహిళపై జరుగుతున్న నేరాల విషయంలో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆడవాళ్లు, చిన్నారులపై జరిగే నేరాలు సమాజంలో తీవ్ర ఆందోళనకరంగా మారాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# రేవంత్ సిగ్గుపడాలి

- ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నారు
- ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**అమ్మన్యూస్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. సిగ్గుపడాలి రేవంత్ రెడ్డి.. ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే ఈ ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని నిలదీశారు. ఆడపిల్లలు రెండు కిలోమీటర్లు నడిచి జాతీయ రహదారి మీద ధర్నా చేస్తే ఈ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు స్పందన లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు సందర్శించారు. పిల్లల బాధ తెలుసుకోవాలని ఇక్కడికి వచ్చాం. పిల్లల కళ్లలో నీళ్లు కారిపోతున్నాయి, దుఃఖాన్ని ఆపులేకపోతున్నారు, భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే విపరీతంగా కర్రలు విరిగిపోయేలా కొడుతున్నారని ఏడుస్తున్నారన్నారు. పిల్లల పరిస్థితి చూస్తుంటే మా కళ్లల్లో కూడా నీళ్లు ఆగలేదు, అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబితే, వాటిని తీసేసి తినండిని టీచర్లు చెబుతున్నారని పిల్లలు చెప్పారు, పాఠాలు సరిగా చెప్పడం లేదు. మంచి భోజనం లేదు. కనీస సౌకర్యాలు కూడా లేవని పిల్లలు బాధపడుతున్నారు. ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారని ఆరో తరగతి పిల్లలు చెబుతున్నారు. బుక్స్ కూడా ఇవ్వలేదు. బట్టలు రావు.. పుస్తకాలు రావు.. కడుపు నిండా భోజనం పెట్టే పరిస్థితి లేదు. గతంలో కేసీఆర్ సన్నబియ్యంతో భోజనం పెడితే.. ఇవాళ గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. ప్రతి రోజు కోడిగడ్డు ఇవ్వాలని ఉంది. వారానికి రెండుసార్లు ఇస్తున్నారు. ఆ కోడిగుడ్లు వాసన వస్తున్నాయని, వాటిని తినకలేకపోతున్నామని పిల్లలు బాధపడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రభుత్వంలో కస్తూర్బా విద్యాలయాలతో పాటు ఇతర గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. విషాహారం తిని పిల్లలు ఆస్పత్రుల పాలవుతున్నారని, ఇప్పటి వరకు 500 మంది దాకా ఆస్పత్రి పాలయ్యారని, 38 మంది చనిపోయారన్నారు. ఒక వైపు పాము కాట్లు, మరో వైపు ఎలుకలు కొరుకుతున్నాయని, అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాయంపేట ఎస్సీ గుర్నకులంలో 11 మంది, నల్లగొండ బీసీ గురుకులంలో 13 మంది విద్యార్థులను ఎలుకలు కొరకడంతో వారు ఆస్పత్రి పాలయ్యారని హరీష్ రావు పేర్కొన్నారు. ఒకప్పుడు తెలంగాణ గురుకులాలు దేశానికి ఆదర్శంగా ఉండేవన్నారు. ఇప్పటికైనా రివ్యూ చేయండి, టీచర్లందరిని మార్చండి, నాణ్యమైన భోజనం పెట్టండని రాష్ట్ర ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

# అల్ప పీడన ప్రభావం

## తెలంగాణకు అలర్ట్ జారీ.. అప్రమత్తమన్న వాతావరణ శాఖ

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం ఉదయం వాయగుండంగా మారింది. దీంతో ఇవాళ, రేపు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం బంగాళాఖాతంలోనే వాయుగుండం కొనసాగుతోంది. ఆదివారం తెల్లవారుజామున కళింగపట్నం, విశాఖపట్నం, గోపాల్ పూర్ తీర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట సహా పలు జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వానలు కురుస్తాయని తెలిపింది. వాయుగుండం తీరం దాటే సమయంలో తెలంగాణలో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితేనే బయటకు రావాలని సూచించింది.

# తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద....

22 గేట్లు ఎత్తి.. 54,284 క్యూసెక్కుల నీరు విడుదల...



**అమ్మ న్యూస్/భద్రాచలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరదనీరు క్రమంగా పెరుగుతోంది. ఛత్తీస్ ఘడ్ తో పాటు తెలంగాణాలో కురుస్తున్న వర్షాలకు ఎగువఉన్న చింతవాగు,రోటెంత వాగులు పొంగి పొర్లడంతో ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. మొత్తం 25 గేట్లలో 7 గేట్లను పూర్తిగా..15 గేట్లను 4 అడుగుల మేర 22 గేట్లను ఎత్తి 54,284 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. మరో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తాలిపేరు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే అవకాశం ఉంది.

# టికెట్ లెస్ ప్రయాణికులే ఎక్కువ

- ఆక్యుపెన్సీ పెరిగినా
- పురుష ప్రయాణికులు తగ్గుముఖం
- ఆర్టీసీకి వింత అనుభవం
- ఆదాయార్జన కోసం పాట్లు

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** ఆర్టీసీ బస్సు ప్రయాణం బెంబేలెత్తిస్తోంది. బస్సుల్లో పయాణించేందుకు పురుష ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులు ఎప్పుడు చూసినా మహిళలతో కళకళలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో బస్సుల్లో ప్రయాణం దాదాపు అసాధ్యంగా మారింది. దీంతో పురుష ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఒకప్పుడు బస్సుల్లో మూడొంతుల పురుష ప్రయాణికులతో కనిపించే రద్దీ ఇప్పు డు మహిళలతో నిండుగా పరుగులు తీస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. కానీ ప్రభుత్వం రీయింబర్స్ రూపంలో చెల్లిస్తుండడంతో నగదు రూపంలో వచ్చే ఆదాయం భారీగా పడిపోయింది. దీంతో టికెట్ కొనుగోలు చేసి ప్రయాణించే పురుష ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు ఆర్టీసీ వినూత్న పంథాలో ముందుకెళ్తోంది. ప్రతి డిపోలో రోజుకు రూ. లక్ష అదనపు ఆదాయమే లక్ష్యంగా కండక్టర్లు, డ్రైవర్ల కు టార్గెట్ ఇచ్చింది యాజమాన్యం. యాజమాన్యం ఒత్తిడి కారణంగా అదనపు ఆర్జన కోసం కండక్టర్లు, డ్రైవర్లు రూ. లక్ష లక్ష్యంగా మగ ప్రయాణికుల వేటలో పడ్డారు. ప్రధాన బస్టాపుల్లో బస్సుల కోసం ఎదురు చూసే మగ ప్రయాణికులను బస్సెక్కండి ప్లీజ్ అంటూ ఆహ్వానించడం ఆసక్తికరమైన పరిణామం.

### సొంత వాహనాలకే పురుషుల ప్రాధాన్యం

మరోవైపు ఆర్టీసీ అధికారుల అంచనాల మేరకు మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పెరిగిన మహిళా ప్రయాణికుల రద్దీతో మగవారు సొంత వాహనాల వినియోగం వైపు మళ్లారు. ద్విచక్ర వాహనాల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని పురుష ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు ఆర్టీసీ వినూత్నంగా స్పెషల్ బస్సులు నడిపేందుకు సన్నాహాలు చేపట్టారు. కానీ దీనిపై వ్యతిరేకత రావడంతో ఈ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. సీట్లపై స్త్రీలకు మాత్రమే అని కనిపించే వాటి సంఖ్య ను తగ్గించారు. పలు మార్గాల్లో మెట్రో లగ్జరీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. క్రమక్రమంగా పల్లె వెలుగు, సూపర్ ఎక్స్ ప్రెస్ బస్సులను తగ్గించి సూపర్ లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టేందుకు యోచన చేస్తున్నారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ గౌస్ ఆలం

## పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం.. సేవలు అందించినందుకు అభినందనలు



**ఆదిలాబాద్ అమ్మన్యూస్ ప్రతినిధిః** పదవీ విరమణ అనంతరం తమ శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. దాదాపు 40 ఏండ్లపాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులకు ఆయన అభినందనలు తెలియజేశారు. స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందిన అధికారులను వారి కుటుంబ సభ్యుల నడుమ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. ఆదిలాబాద్ వన్ టౌన్ ఎస్ఐ రామారావు, రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మహమ్మద్ జహీరుద్దీన్లను సత్కరించారు. సర్వీసులో ఎటువంటి రిమార్కులు లేకుండా విధులను నిర్వర్తించి ప్రశంసలు, మన్ననలు పొందడం అభినందనీయమని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో పదవి విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, ఎస్పీ సీసీ దుర్గం శ్రీనివాస్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారి గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా దూకుడు

### ఆరుగురు ఆఫీసర్ల అరెస్ట్‌కు రంగం సిద్ధం

### ఈవోడబ్ల్యూకు పూర్తి అధికారాలు

**అమ్మన్యూస్, హైదరాబాద్:** నాలాలు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులను జైలుకు పంపేందుకు రంగం సిద్ధమైంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్? సిఫారసుతో స్పందించిన సైబరాబాద్? సీపీ అవినాశ్? మహంతి ఆరుగురిపై చర్యలకు డీసీపీ ప్రసాద్? నేతృత్వంలోని ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈవోడబ్ల్యూ) కు బాధ్యతలు అప్పగించారు. హైడ్రా నుంచే పూర్తి ఆధారాలు అందడంతో ఆరుగురిపై కేసులు నమోదు చేసిన స్పెషల్ వింగ్ సంబంధిత అధికారులను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. బాచుపల్లి ఎర్రకుంటలోని చెరువు శిఖం భూమిని పట్టా భూమిగా చూపుతూ తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ తప్పుడు నివేదిక ఇచ్చారు. దాన్ని చూపి నిర్మాణదారు హెచ్ఎండీఏ నుంచి ఎర్రకుంటలో లేఅవుట్‌కు అనుమతి పొందారు. అక్కడ నిర్మాణాలకు నిజాంపేట నగరపాలక సంస్థ కమిషనర్ రామకృష్ణారావు అనుమతి ఇచ్చారు. ఆ నిర్మాణాలను ఇటీవల హైడ్రా కూల్చివేసింది. చందానగర్ సర్కిల్ పరిధిలోని ఈర్ల చెరువులో మూడు భవనాలకు అనుమతి ఇవ్వడమే కాకుండా నిర్మాణం పూర్తవకముందే వాటికి ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. వాటిని హైడ్రా కూల్చింది. అనుమతులు ఇచ్చిన అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సర్కిల్? డిప్యూటీ కమిషనర్ సుధాంశు ఇద్దరిపైనా చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**అమ్మ న్యూస్/భద్రాచలం:** వాతావరణ శాఖ సమాచారం ప్రకారం శనివారం నుండి వచ్చేనెల నాల్గో తేదీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పట్టణాలు, మండలాలు మరియు గ్రామాల పరిధి లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. సుదూర ప్రాంత ప్రయాణాలు చేయరాదని... ప్రజలు ప్రయాణించే మార్గంలో వాగులు వంకలు దాటరాదని... గ్రామీణ ప్రాంతంలోని మట్టి గోడల ఇల్లు, పాకలలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలోని అధికారులందరూ సమైక్యంగా పనిచేసే ఎటువంటి నష్టం కలగకుండా తమ వంతు బాధ్యతలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# కేథరిన్ అందాల ఆరబోత

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ సినిమాలతో కేథరీన్ ట్రెసా అలెగ్జాండర్ అందరి మనస్సును గెలుచుకుంది. 2010లో వచ్చిన "శంకర్ ఐపిఎస్" చిత్రంతో ఆమె కెరీర్‌ను ప్రారంభించిన సుందరి.. అప్పటినుండి తన నటనతో స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకర్షిస్తూనే ఉంది. కేథరీన్ ఇటీవల 2023 తెలుగు భాషా యాక్షన్ థ్రిల్లర్ "వాల్టెయిర్ వీరయ్య"లో కనిపించింది. కేథరీన్ తరచుగా తన స్టైలిష్ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో గోల్డెన్ హూప్ చెవిపోగులు, కంకణాలతో జతచేసిన స్కై-బ్లూ దుస్తులు ధరించి అభిమానులకు పోస్టు చేసింది.

